క్లుప్తంగా

రేపటి నుంచి ఒనువులమ్మ జాతర


ఒనువులమ్మ తల్లి

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో ఒనువులమ్మ తల్లి జాతరకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మహోత్సవాలను ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం సాంస్కృతిక బృందాలతో అమ్మవారి ఊరేగింపు, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు, సోమవారం సాయంత్రం బలిచేట, మినానగరం, కాండ్రకోట వారిచే బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. మంగళవారం మొక్కుబడులు ఉంటాయి. గ్రామస్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

విద్యార్థులకు విద్యా కానుక కిట్లు


సీతానగరంలో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీవైఈఓ తిరుమల దాస్

సీతానగరం: పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని డీవైఈఓ ఎం.తిరుమలదాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు వచ్చిన ఆయన జేవీకే కిట్లను, నాడు– నేడు పనులను పరిశీలించారు. పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యా కానుక కిట్లను ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. ఎంఈఓ కె.స్వామినాయక్, హెచ్‌ఎం పుష్పలత, ఉపాధ్యాయులు కన్నూరి సతీష్‌బాబు, సీఆర్పీలు చంటిబాబు, రమణ, ప్రసాద్, బేగం తదితరులు పాల్గొన్నారు.

14న సుందరకాండ పారాయణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు ఎలక్ట్రికల్ కాలనీలోని శ్రీసంతాన సీతారామ ఆలయ ప్రాంగణంలో హనుమత్ జయంతి సందర్భంగా 14న ఉదయం 6 గంటలకు సుందరకాండ పారాయణ జరుగుతుంది. విశ్రాంత తెలుగు పండిట్ సూరికుచ్చి వెంకటసత్యప్రసాద్‌చే సుందరకాండ పారాయణ జరుగుతుందని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది.

పేదలకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ


బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న మార్గాని నాగేశ్వరరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఎంపీ మార్గాని భరత్‌రామ్ జన్మదినం సందర్భంగా కవలగొయ్యి గ్రామంలో సచివాలయ కన్వీనర్ తీగిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 300 మందికి బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్ మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మార్గాని సురేష్, పాలిక శ్రీను చేతుల మీదుగా పేదలు, వృద్ధులకు బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రేలంగి వీర వెంకట సత్యనారాయణ, నిచ్చెనకోళ్ల రామకృష్ణ, రేలంగి ఎర్ర శ్రీను, రేలంగి సత్యనారాయణ, వల్లేటి చిన్నబాబు, కె.చంటి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా వెంకటరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా అనపర్తికి చెందిన పడాల వెంకటరెడ్డి ఎంపికైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి దాసు, కొప్పవరం మాజీ సర్పంచి తాడి సూరారెడ్డి, మల్లిడి గోవిందరెడ్డి, తిరగటి శివ, మర్రె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మధురపూడి: నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలంటూ బీజేపీ నాయకులు శుక్రవారం నార్త్‌జోన్ డీఎస్పీ కదలి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. తొలుత ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపీఆర్ చౌదరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నీరుకొండ వీరన్నచౌదరి ఆధ్వర్యంలో కోరుకొండలో ర్యాలీ చేశారు. కాతేరు నుంచి సీతానగరం రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఆవ భూముల్లో అక్రమాలు అరికట్టాలని నినాదాలు చేశారు. ఆయా మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆటాడుకుందాం రండి..

- అర్బన్, రూరల్‌లలో వేసవి శిక్షణ శిబిరాలు
- శాప్ ఆధ్వర్యంలో నిర్వహణ
- బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడలపై ఆసక్తి

ప్రకాశంనగర్: సెలవులు.. విద్యార్థులు ఉల్లాసంగా గడిపే రోజులు. ఆటపాటలతో ఆనందంగా సాగే మరపురాని గడియలు.. అలాంటి రోజులను కొందరు సద్వినియోగం చేసుకుంటున్నారు.. తమకు ఇష్టమైన రంగాల్లో ప్రతిభ చాటేందుకు తర్ఫీదు తీసుకుంటున్నారు.. ఇప్పటి వరకూ పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు వేసవి సెలవులు కావడంతో తమ అభిరుచికి అనుగుణంగా క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. దీనికి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) సహకారం అందిస్తుంది. శాప్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టెన్నీ కాయిట్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, బాక్సింగ్, కిక్ బాక్సింగ్, ఆర్చరీ, కరాటే, ఖోఖో, యోగా వంటి సుమారు 20 క్రీడల్లో శిక్షణ ఇస్తుంది. ఇందులో ప్రధానంగా బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడల్లో యువత, చిన్నారులు ఎక్కువగా శిక్షణ పొందుతున్నారు. క్రీడాకారుల ఆసక్తికి అనుగుణంగా రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలోని ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కేవీటీ, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, పేపర్‌మిల్లు స్కూల్, డీఎంహెచ్‌ఎస్, జెడ్పీ హైస్కూల్ కడియం క్రీడా మైదానాల్లో విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ప్రధానంగా బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్‌లలో సుమారు 150 మంది శిక్షణ తీసుకుంటున్నారు. ఇవి కాకుండా సిటీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు బ్యాచ్‌లుగా క్రీడాకారులకు బాస్కెట్ బాల్‌లో శిక్షణ అందిస్తున్నారు.


ఎస్‌కేవీటీ కళాశాలలో ఫుట్‌బాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఫుట్‌బాల్‌లో సత్తా..

స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులు వీవీ భాస్కర్, కె.అనిల్‌కుమార్, పి.సాయి సంపత్‌రాజ్‌లు గత ఏడాది జరిగిన జాతీయ స్థాయి సంతోష్ ఫుట్‌బాల్ ట్రోఫీలో మన రాష్ట్రం తరఫున ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరితో పాటు ఈ ఏడాది జనవరి 26 నుంచి 30 వరకూ సూరత్‌లో జరిగిన హీరో నేషనల్ బీచ్ ఫుట్‌బాల్ పోటీలకు నగరానికి చెందిన సుంకర భాస్కర్‌రావు మెమోరియల్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహంతీ లోకేష్ మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించాడు. నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు ఫుట్‌బాల్‌లో సత్తా చూపడంతో ఇటీవలే జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఎస్‌కేవీటీ కళాశాల క్రీడా మైదానాన్ని ఫుట్‌బాల్ క్రీడా మైదానంగా ఎంపిక చేసింది. అయితే దీనికి సంబంధించిన విధి విధానాలు ఇంకా పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. విద్యార్థులకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించడంతో రాణిస్తున్నారని క్రీడా విశ్లేషకులు అంటున్నారు.

ఆసక్తి పెరిగింది..



గతంతో పోలిస్తే ఫుట్‌బాల్ క్రీడపై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది. నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం ఎంతో గర్వకారణం. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుంది. అక్కడ అనేక మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. ఈ శిక్షణ భవిష్యత్‌లో వారి ఉన్నతికి సహాయపడుతుంది.

– సుంకర నాగేంద్రకిశోర్, గౌరవ కార్యదర్శి, జిల్లా ఫుట్‌బాల్ సంఘం

సేవచేసి.. అభిమానం చాటి

- నిరాడంబరంగా ఎంపీ భరత్ జన్మదినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ నిస్వార్థ నేత బూరాడ భవానీ శంకర్ మృతికి సంతాప సూచకంగా ఎవరూ తన పుట్టినరోజు వేడుకలు చేయవద్దని, కేక్ కటింగ్స్, మిఠాయిలు పంపిణీ తదితరాలు చేయవద్దని పార్టీ శ్రేణులకు ఎంపీ మార్గాని భరత్‌రామ్ సూచించారు. సేవాకార్యక్రమాలు మాత్రమే చేయాలని తెలిపారు. దీంతో స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో శుక్రవారం నిరాడంబరంగా ఎంపీ భరత్ జన్మ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎంపీ భరత్ దూరంగానే ఉన్నారు. నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా టీమ్ మార్గాని సుశీల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మార్గాని సుశీల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ప్రారంభించారు. ఈ శిబిరంలో నగర యూత్ అధ్యక్షుడు పితా రామకృష్ణ, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి సత్యకృష్ణ తదితరులు రక్తదానం చేశారు. అలాగే పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎన్వీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 500 మంది పేద మహిళలకు చీరలను మార్గాని నాగేశ్వరరావు, అడపా శ్రీహరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడపా శ్రీహరి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను మాట్లాడుతూ ఎంపీ భరత్ జన్మదినోత్సవాన్ని పలు సేవలు నిర్వహించామన్నారు. మార్గాని సురేష్, మిండి నాగేంద్ర పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మార్గాని నాగేశ్వరరావు, అడపా శ్రీహరి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీ భరత్‌రామ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని క్వారీ మార్కెట్ సెంటర్లో శ్రీగౌతమీ జీవకారుణ్య సంఘం నూతన చైర్మన్ బర్రే కొండబాబు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డెల్టా ఆసుపత్రి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో కొనసాగిన ఈ శిబిరాన్ని రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి ప్రారంభించారు. క్వారీ మార్కెట్ సెంటర్లో ఉల్లూరి రాజా ఆధ్వర్యంలో 300 మందికి బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. ఈఎస్‌ఐ హాస్పిటల్ సమీపంలో వాటర్ ట్యాంకుల వద్ద అరిగెల బాబు ఆధ్వర్యంలో 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. చందా సత్రం ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ ఎదురుగా గౌతమీ జీవకారుణ్య సంఘం వద్ద విద్యుత్ కార్యాలయ సమీపంలో పార్కుని ఆనుకుని చలివేంద్రాన్ని ప్రారంభించారు. పీతా రామకృష్ణ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి భోజన ఏర్పాట్లు చేశారు. స్థానిక మెయిన్ రోడ్డు నల్లమందు సందు వద్ద లోవ సురేష్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాంతారామ్ పాటిల్, బెంగాలి మండల్ సంయుక్త ఆధ్వర్యంలో గోదావరి గట్టు మార్కండేశ్వర స్వామి ఆలయ సమీపంలో వైఎంవీఏ ఫంక్షన్ హాల్ పక్కన సుమారు 500 మందికి అన్నదానం చేశారు. చిన్న మసీదు ఎదురుగా ముస్లింల ఆధ్వర్యంలో 200 మందికి చీరలు పంపిణీ చేశారు. మెయిన్ రోడ్డు గుల్‌సల్ పంజా వద్ద మహిళలకు ఎండీ రమీజ్, ఎండీ అక్రమ్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు, రొట్టెలు అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాజీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గుత్తుల మురళీధర్ ఆధ్వర్యంతో స్వర్ణాంధ్ర వృద్ధులకు బిస్కెట్లు, పండ్లు పంచి పెట్టారు. 30వ డివిజన్లో ఎస్సీసెల్ నగర చైర్మన్ కాటం రజనీకాంత్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను టీకే విశ్వేశ్వరరెడ్డి అందజేశారు.


క్వారీ సెంటర్ వద్ద శిబిరంలో వైద్య పరీక్షలు

వీవీ వినాయక్ హిందీ ‘ఛత్రపతి’ రిలీజ్ సందడి

చాగల్లు: ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం ఛత్రపతి విడుదల సందర్భంగా శుక్రవారం ఆయన స్వగ్రామం చాగల్లులో అభిమానులు సందడి చేశారు. అభిమానుల కోసం వీమాక్స్ థియేటర్‌లో ప్రత్యేక ప్రీ షో ప్రదర్శించారు. భారీఎత్తున బాణసంచా కాల్చారు. అందరికి స్వీట్లు పంచి పెట్టి సంబరాలు జరిపారు. శుక్రవారం నాడు దేశవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రాన్ని మన రాష్ట్రంలో మల్టీప్లెక్స్ థియేటర్లలో మాత్రమే ప్రదర్శిస్తున్నారని ఆయన సోదరుడు, మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ తెలిపారు. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కొఠారు అశోక్‌బాబా మాట్లాడుతూ తెలుగులో డైనమిక్ డైరెక్టర్ అయిన వినాయక్, బాలీవుడ్ ప్రేక్షకుల అంచనాలకు తగట్టుగా హిందీలో కూడా ఛత్రపతి సినిమా రూపొందించారన్నారు. కార్యక్రమంలో త్రివేణీ గ్లాస్ ఫ్యాక్టరీ డైరెక్టర్ ఫాణిగ్రాహి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి హనుమజ్జయంతి

నిడదవోలు రూరల్: మండలంలోని రావిమెట్ల గ్రామంలో కొలువైన అభయాంజనేయస్వామి వారి 16వ జయంతి మహోత్సవాలను ఈ నెల 14 నుంచి 18 వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 14న హనుమాన్ చాలీసా పారాయణ, 15న ఏకాహం, 16 సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామని వారు వివరించారు.

హ్యాండ్‌బాల్ పోటీలో ప్రతిభ

ప్రకాశంనగర్: తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో ఈ నెల 1 నుంచి ఏడో తేదీ వరకూ నిర్వహించిన ఏపీ సీఎం కప్ మహిళా హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. శుక్రవారం ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కె.నందిని, టి.పుణ్యవతి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థినులను వ్యాయామ అధ్యాపకుడు కిశోర్‌బాబు, అధ్యాపకుడు సంజీవరావు తదితరులు అభినందించారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

ప్రకాశంనగర్: వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ సూచించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలోని టెన్నిస్ కోర్టులో ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో టెన్నిస్ ఫ్రీ కోచింగ్ సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించడంతో మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. విద్యార్థి సంఘం అధ్యక్షుడు ముళ్ల మాధవ్, టెన్నిస్ క్లబ్ అధ్యక్షుడు గాదిరెడ్డి కుమార్, కార్యదర్శి శ్యామ్‌సింగ్, కోశాధికారి ముత్తంగి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆదివాసీ సదస్సు విజయవంతానికి పిలుపు


పోస్టర్‌ను విడుదల చేస్తున్న రైతు కూలీ సంఘం ప్రతినిధులు

రాజానగరం: విశాఖపట్నంలో ఈ నెల 21న జరిగే అఖిల భారత ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక డివిజన్ కార్యాలయంలో విడుదల చేశారు. ఆదివాసీల అస్తిత్వ రక్షణకు పర్యావరణ జీవావరణాల పరిరక్షణకు ఈ సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సదస్సుకు గిరిసులంతా తరలిరావాలన్నారు. రైతు కూలీ సంఘం ప్రతినిధులు మరుకుర్తి వీరలక్ష్మి, నక్క లక్ష్మి, ఉంగరాల వరలక్ష్మి, దమ్ము సీత, గున్నూరు బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సై సీత మృతి


సీత (ఫైల్)

ధవళేశ్వరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న నేలపూడి సీత (61) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా ఊపిరితిత్తుల సమస్యతో ఆమె బాధపడుతున్నారు. రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. సీత మృతికి సీసీఎస్ సీఐ కృపానందం, ఎస్సై కె.కేశవరావు, సిబ్బంది సంతాపం తెలిపారు.

రాజీ లేకుండా అభివృద్ధి పనులు

రాజమహేంద్రవరం సిటీ: నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా కంబాలచెరువు పార్కు అభివృద్ధి పనులు చేస్తున్నామని, దీనిని ఆగస్టు నాటికి ప్రారంభిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కంబాలచెరువు అభివృద్ధి పనులను అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కాక ముందే సిమెంట్ పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. కంబాలచెరువు సుందరీకరణ రెండో దశలో ఏర్పాటు చేయాల్సిన లైటింగ్, గ్రీనరీ, ఆట వస్తువుల ఏర్పాటుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ త్వరగా మొదలు పెట్టాలని సూచించారు. కంబాలచెరువు సుందరీకరణ పూర్తి చేసి ఆగస్టు నాటికల్లా ప్రజలకు అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో ఉన్నామన్నారు. దండి మార్చి వద్ద మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం వై.జంక్షన్ వద్ద జీఎన్‌టీ రోడ్డు పనులు పరిశీలించారు.


కంబాలచెరువు పార్కు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కంబాలచెరువు: పోలీస్ స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన స్పెషల్ సెల్ ద్వారా భూమిక ఉమెన్ హెల్ప్‌లైన్ సెంటర్ సేవలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జాంపేట దిశ పోలీస్ స్టేషన్‌లో భూమిక హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల సహకారంతో భూమిక హెల్ప్‌లైన్ కేంద్రాన్ని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. భూమిక ఎన్‌జీఓ డైరెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ హెల్ప్‌లైన్ సెంటర్ 24 గంటలూ పనిచేస్తుందన్నారు. ఇతర దేశాల నుంచి కూడా బాధితులు కాల్స్ చేస్తుంటారని, వారికి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. హెల్ప్‌లైన్ కౌన్సిలర్ సుమలత మాట్లాడుతూ గృహహింస, వరకట్న బాధిత మహిళలకు న్యాయ సహకారం అందిస్తామన్నారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వి.ప్రభావతి, హరిత దళం ఎన్‌జీఓ మేనేజర్ యార్లగడ్డ చిట్టిబాబు, గ్రేస్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ రోషన్ వర్ఘిల్, హ్యూమన్ రైట్స్ చానెల్ ప్రతినిధి కిశోర్, రంపచోడవరం ఐటీడీఏ భూమిక కౌన్సిలర్ సీహెచ్ శ్రీదేవి పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

ఆచార్య టేకి మృతి తీరనిలోటు

రాజానగరం: ఆచార్య ఎస్.టేకి మృతి యూనివర్సిటీకి తీరనిలోటని ఆదికవి నన్నయ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ ఈసీ హాలులో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టేకి చిత్రపటానికి రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరంతరం చలాకీగా ఉంటే ఆచార్య టేకి గుండెపోటుకు గురికావడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఓ మంచి అధ్యాపకుడిని కోల్పోయామంటూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. యూనివర్సిటీ అధికారులు ఆచార్య పి.సురేష్‌వర్మ, ఆచార్యులు కేఎస్ రమేష్, వై.శ్రీనివాసరావు, డి.జ్యోతిర్మయి, డాక్టర్ బికెజియారాణి, డాక్టర్ ఎం.కమలాకుమారి, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ ఎ.మట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆచార్య ఎస్.టేకి మృతికి పలువురు ఆన్‌లైన్‌లో సంతాపాన్ని తెలిపారు. ఇందులో నూతన వీసీగా నియమితులైన ఆచార్య కె.పద్మరాజు, పూర్వపు వీసీలు ఆచార్య కె.నిరూపారాణి, అల్లం అప్పారావు, పి.జార్జివిక్టర్, ఎం.ముత్యాలనాయుడు, ఏవీ ప్రసాదరావు ఉన్నారు.


ఆచార్య టేకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యూనివర్సిటీ అధికారులు

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి గణేష్
- శ్రీరంగపట్నంలో గడప గడపకూ..

మధురపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ అన్నారు. శ్రీరంగపట్నంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సారథ్యంలో అన్ని వర్గాల సంక్షేమానికి బాటలు పడ్డాయన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు ప్రజల్లో ఉంటూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా శ్రమిస్తున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. ప్రతి పథకం ప్రజలకు చేరాలన్న లక్ష్యంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజల కోసం శ్రమిస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదన్నారు. తుపానులు, ప్రకృతి వైపరీత్యాలకూ ప్రభుత్వాన్ని నిందించడం దుర్మార్గమన్నారు. నెల్లూరులో ఏళ్ల తరబడి పరిష్కారం కాని చుక్కల భూమిని సాగుదారులైన రైతన్నలకు అందించిన ఏకైక ప్రభుత్వమిదే అన్నారు. జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు పాలన చేరువైందన్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహించిన కార్యక్రమంలో 320 గడపలు తిరిగారు. పార్టీ నాయకులు మద్దాల రమణ, సూరిశెట్టి అప్పలస్వామి, కొయిడాల నానాజీ, సూరిశెట్టి కుటుంబరావు, ఉల్లి గణ, శ్రీహరి, శ్రీరంగపట్నం పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుద్దా శ్రీనివాస్ పాల్గొన్నారు.


శ్రీరంగపట్నంలో పథకాల గురించి వివరిస్తున్న జక్కంపూడి గణేష్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్‌చెరువు పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకుపై వెళ్తున్న ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం. ఐస్‌క్రీమ్‌లతో కూడిన బాక్స్‌ని బైకుపై పెట్టుకుని, రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వైపు వెళ్తున్న ఓ యువకుడు పైప్రాంతంలో ముందు వెళ్తున్న కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన అతనిని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా అతని వద్ద ఏవిధమైన రికార్డు లేకపోవడంతో ఆ యువకుడు ఎవరనే విషయాలు తెలియలేదు. ఈ విషయమై బొమ్మూరు పోలీసులను వివరణ కోరగా ఆస్పత్రి వర్గాల నుంచి సమాచారం రావాల్సి ఉందన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: రఘుదేవపురం గ్రామానికి చెందిన పరిమి శోభారాణిని బొబ్బిల్లంకకు చెందిన ప్రసాద్ కొట్టారని ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు.